'ఆ స్పీడ్ బ్రేకర్లను తొలగించాలి'

చంపాపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని ఆర్‌కే ఆర్ ఎన్‌క్లేవ్ కాలనీలో జీహెచ్ఎంసీ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగించాలని వాహనదారులు, కాలనీవాసులు అధికారులను కోరారు. వంద మీటర్లు ఉన్న రహదారిపై మూడు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం ఎంత వరకు సమంజసం అని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు కాలనీలో తమ గృహాల ముందు ఇష్టానుసారంగా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసే ముందు జీహెచ్ఎంసీ అనుమతులు తీసుకోవాలని, వాటి పరిసరాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. అనధికారంగా వేసిన స్పీడ్ బ్రేకర్లను తొలగించాలని వారు జీహెచ్ఎంసీ డీసీ దశరథ, ఇతర శాఖల అధికారులను కోరుతున్నారు.

మార్చి 25 నుంచి వేదాంత జ్ఞానసభలు

దిల్‌సుఖ్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీ సనాతన వేదాంత జ్ఞాన సభలను విజయవంతం చేయాలని శ్రీవ్యాస ఆశ్రమ గురుపరంపర స్వామిజీ సూచించారు. యజ్ఞంలో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన ఆయన బుధవారం గడ్డిఅన్నారం లలితానగర్‌లోని శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామి దేవస్థాన చైర్మన్ వూర నర్సింహాగుప్తా నివాసాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మార్చి 25, 26, 27వ తేదీలలో బాలాపూర్‌లోని ఎస్‌పీఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించనున్న వేదాంత జ్ఞాన సభల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్తీ శ్రీనివాస్‌గుప్తా, ఊర శ్రీనివాస్‌గుప్తా, యాద అశోక్‌గుప్తా, సూరిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయం మీదుగా స్టీల్ బ్రిడ్జి వద్దు


డీసీపీ జానకీ ధరావత్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ అరుణారెడ్డి, బీజేపీ నేతలు

సైదాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి (ఫ్లైఓవర్) నిర్మాణం హనుమాన్ ఆలయం మీదుగా వద్దంటూ బుధవారం సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ జానకీ ధరావత్‌కు ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నేతలు వినతిపత్రం సమర్పించారు. వందల ఏళ్ల నాటి సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న శ్రీ హనుమాన్ ఆలయం మీదుగా బ్రిడ్జి చేపడితే భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. మరోసారి సర్వే నిర్వహించి రీ అలైన్‌మెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్, బీజేపీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, వినోద్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు సతీష్ కుమార్, వినయ్ కిషోర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తాగి నడపొద్దు

వనస్థలిపురం, జనవరి 31 (ఆంధ్ర జ్యోతి): మద్యం తాగి, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి.రమేష్ సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవం-2024 పురస్కరించుకుని నాగోల్‌లోని డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లో జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో వాహన, స్కూలు బస్సు డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అనంతరం డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్టీవో విజయపాల్ రెడ్డి, ఎస్.శ్రీనివాస్, జీ.ఆర్ రాజు, కె.రవీందర్ రెడ్డి, శీతల్ చౌహాన్, సి.స్వప్న, పి.రఘుకుమార్ పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న జేఏసీ చైర్మన్ అశ్వత్థామరెడ్డి, కన్వీనర్ నరేందర్, సత్యం తదితరులు

ఆర్టీసీ విలీనం ప్రక్రియ పూర్తి చేయాలి

చాదర్‌ఘాట్. జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విలీనం ప్రక్రియను సత్వరమే పూర్తిచేసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని పలు ఆర్టీసీ సంఘాల నాయకులు ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ అశ్వత్థామరెడ్డి ఆధ్వర్యంలో వైస్‌చైర్మన్ హనుమంతు, కన్వీనర్లు మర్రి నరేందర్, సురేష్, శంకర్, కమల్‌రెడ్డి, కామ్రేడ్ సత్యం, ఎన్ఎంయూ చైర్మన్ చెన్నారెడ్డి, నరేందర్‌రావు, రాజలింగంతోపాటు పలు కార్మిక సంఘాల నాయకులు ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి ఘనంగా సన్మానించారు.

పేదలకు 'కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్' భరోసా

చాదర్‌ఘాట్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబంలోని ఆడ పిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా చెక్కులను అందజేస్తోందని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. బుధవారం మలక్‌పేట నియోజకవర్గంలోని సైదాబాద్, అంబర్‌పేట, చార్మినార్ మండలాల పరిధుల్లోని శంకేశ్వర్‌బజార్, జయనగర్, ఎల్‌సీహెచ్‌కాలనీ, గాంధీనగర్, అక్బర్‌బాగ్, ఆజంపుర, ఓల్డ్‌మలక్‌పేట, చంచల్‌గూడ, ఉస్మాన్‌పుర, కట్టలగూడ, షాకాలనీలకు చెందిన 111 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కిసాన్ అగ్రి షోలో 'పెర్‌ఫెక్ట్' ఉత్పత్తులు


ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు ప్రదర్శన



'పెర్‌ఫెక్ట్' బాటిల్

బెంగళూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ప్రధానకేంద్రంగా సేవలందిస్తున్న క్రాఫ్ట్ ఫౌండేషన్, గ్లోబల్ గ్రీన్ అగ్రినోవా నిర్వహణలోని 'పెర్‌ఫెక్ట్' బ్రాండ్ ఉత్పత్తులను హైదరాబాద్‌లోని హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు జరిగే కిసాన్ అగ్రి షోలో ప్రదర్శించనున్నారు. ఈ మేరకు సంస్థ బెంగళూరులో బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. వృక్ష ఆయుర్వేదంతో 11 వనమూలికల ఔషధ సమ్మేళనంగా ఉన్న 'పెర్‌ఫెక్ట్' మందు సమగ్ర సస్యరక్షణకు దోహదపడుతుందన్నారు. పంట పొలాలు, తోటల్లో అధిక దిగుబడి సాధించేలా రసాయనిక అవశేషాలు లేని విధంగా విస్తృత పరిశోధనల అనంతరం 'పెర్‌ఫెక్ట్'ను తయారు చేసినట్టు సంస్థ పేర్కొంది. వైరస్ బారి నుంచి పంటలను, తోటలను కాపాడే గొప్ప గుణాలు ఇందులో ఉన్నాయని గ్లోబల్ గ్రీన్ అధినేత బీఎస్.మూర్తి పేర్కొన్నారు. హైదరాబాద్ కిసాన్ అగ్రి ప్రదర్శనలోని బీ-120 పెర్‌ఫెక్ట్ స్టాల్‌ను రైతులు, తోటల పెంపకందారులు సందర్శించి ప్రయోజనం పొందాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

ఎల్బీనగర్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు


మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జనవరి 31: ఎల్బీనగర్ నియోజకవర్గంలోని స్థానిక సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కె.శశాంక తెలిపారు.

ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని స్థానిక సమస్యలపై బుధవారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలను తీసుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ సమావేశంలో ఇబ్రహీంపట్నం, కందుకూర్ ఆర్డీవోలు అనంతరెడ్డి, సూరజ్ కుమార్, తహసీల్దార్లు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రాజేశ్వర్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అంధరకీ ఫిక్స్!

పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాల జోరు

- ప్రజా ప్రతినిధులు, అధికారుల కనుసన్నల్లోనే..
- కూల్చివేసే బాధ్యత డీటీఎఫ్‌దే: యంత్రాంగం
- ఆదాయానికి రూ.లక్షల్లో గండి...


కుంట్లూర్‌లో అనుమతి లేకుండా సెల్లార్ నిర్మాణం



హైదరాబాద్ శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో మూడు పూలు, ఆరు కాయలు అన్న చందంగా అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతోంది. వందల సంఖ్యలో అనుమతి లేని భవనాలు, ఇతర నిర్మాణాలు జరుగుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. అక్రమాలను అరికట్టి మున్సిపాలిటీకి ఆదాయాన్ని సమకూర్చాల్సిన అధికారులే అక్రమదారులకు బాసటగా నిలుస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పలు వార్డుల్లో స్థానిక ప్రజా ప్రతినిధులతో కుమ్మక్కైనా అధికారులు అందినకాడికి దండుకుని వారికి అండగా నిలబడడం విశేషం. ఎవరైనా అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు చేస్తే ఆ విషయాన్ని మున్సిపల్ అధికారులు క్షణాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులకు చేరవేస్తున్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో బట్టి అక్రమ నిర్మాణాల్లో అధికారులే కీలక రోల్‌గా మారినట్లు స్పష్టంగా తెలుస్తోంది. రూ.లక్షల్లో మున్సిపల్ ఆదాయానికి గండి పడుతున్నా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో పాటు మున్సిపల్ ఉన్నత స్థాయి అధికారి సైతం పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఏడాది కాలంగా మున్సిపల్ పరిధిలో ఒక్క అక్రమ నిర్మాణం కూడా కూల్చివేయకపోవడం తీరును చూస్తే అధికారుల అవినీతి ఏ స్థాయిలో ఉందో స్పష్టం అవుతోంది. అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్ నేరుగా చర్యలు తీసుకునే అవకాశం ఉన్న డీటీఎఫ్‌పై నెట్టేసి చేతులు దులుపుకోవడం ఆశ్చర్యం కలిగించే విషయం.

నోటీసులతో సరిపెడుతూ..

మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో భవన నిర్మాణ గుత్తేదారులు ప్రభుత్వ అనుమతులు లేకుండా విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు కడుతున్నారు. జీ ప్లస్-1, 2 అనుమతులు తీసుకుని 3, 4 అంతస్థులను నిర్మిస్తున్నారు. వీటితో పాటు నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లను నిర్మిస్తున్నారు. ఇక కమర్షియల్ షెడ్‌ల నిర్మాణాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. వాటిపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. గట్టిగా నిలదీస్తే మాత్రం సదరు వాటికి నోటీసులు ఇచ్చాం..కూల్చివేసే బాధ్యత మాత్రం డీటీఎఫ్(డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్)ది అంటూ అధికారులు చేతులు దులుపుకొంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మక్కై అక్రమ నిర్మాణదారుల వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

నిర్మాణాలను బట్టి రేటు..

మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను బట్టి వాటికి అధికారులు, ప్రజా ప్రతినిధులు రేటు ఫిక్స్ చేసుకుంటున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కమర్షియల్ షెడ్లు, షెటర్లకు ఒక రేటు కాగా సెల్లార్‌తో పాటు అనుమతులకు మించి నిర్మిస్తున్న అంతస్థులకు మరోక రేటును అధికారులతో కలిసి స్థానిక ప్రజాప్రతినిధులు ఫిక్స్ చేస్తున్నట్లు తెలిసింది. అడిగినంత ఇస్తేనే సరిలేదంటే టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని అక్కడికి పంపి అనుమతులు లేవంటూ పనులను నిలిపివేయించడం లాంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. ఒప్పందం కుదిరితే మరుసటి రోజు నుంచి యధావిధిగా అక్రమనిర్మాణ పనులు జరగడం మున్సిపాలిటీలో పరిపాటిగా మారింది. అక్రమ నిర్మాణాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులదే కీలకపాత్రగా మారింది. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల్లో అధికారుల అవినీతిపై జిల్లా ఉన్నత అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకుంటారో వేచి చూడాల్సిందే..!

డీటీఎఫ్‌కు పంపించాం



మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను గుర్తించి డీటీఎఫ్‌కు పంపిస్తున్నాం. కొన్నింటికి నోటీసులు జారీ చేశాం. కూల్చివేసే బాధ్యత డీటీఎఫ్‌దే.

\- రవీందర్‌రెడ్డి, కమిషనర్
పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ

చెరువు శుద్ధికి కృషి: ఎమ్మెల్యే


బైరామల్‌గూడలోని చెరువు పక్కన ఉన్న మురుగునీటి జంక్షన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ బైరామల్‌గూడలోని చెరువును శుద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని బైరామల్‌గూడ చెరువును బుధవారం జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ దశరథతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువును శుద్ధి చేసేందుకు రెండు 25హెచ్‌పీ మోటార్లను ఏర్పాటు చేసి, మురికి నీరంతా బయటకు పంపింగ్ చేయించాలని అధికారులను ఆదేశించారు. తర్వాత ఇటాచీ, జేసీబీల ద్వారా వ్యర్థాలను తొలగించేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు. వర్షాకాలం నాటికి చెరువు స్వచ్ఛమైన నీళ్లు ఉండనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న డ్రైనేజీ వాటర్ సాఫీగా వెళ్లేందుకు ఏర్పాటు చేసిన జంక్షన్ వద్ద నిత్యం చెత్త, చెదారం తొలగించేందుకు ఓ వ్యక్తిని అక్కడ పని చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అవుట్ సోర్సింగ్ క్రింద అతనికి నెలకు కొంత వేతనం ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, డీసీ దశరథ, ఈఈ కోటేశ్వర్ రావు, ఏఎంహెచ్ఓ వెంకటేష్, డీఈ కనకయ్య, ఇరిగేషన్ డీఈ పవన్, ఏఈ సురేష్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ గజానంద్, నాయకులు సుంకోజు కృష్ణమాచారి, ముదుపు రాజ్‌కుమార్‌రెడ్డి, ఉమామహేశ్వర్, బొంబాయి, మల్లేశ్‌గౌడ్, సాయినగర్ కాలనీ అధ్యక్షుడు బాల్‌రాజ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

బైరామల్‌గూడ చెరువును మంగళవారం సాయంత్రం కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే చెరువు దుర్గంధంగా మారిందన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు పైపులైన్ ద్వారా చెరువు పక్క నుంచి బైరామల్‌గూడ, కర్మన్‌ఘాట్ మీదుగా సరూర్‌నగర్ చెరువు వైపు వెళ్లేదని అన్నారు. కార్పొరేటర్ వెంట డీఈ రఫీ, ఏఈ సురేష్ తదితరులు ఉన్నారు.


శ్రీకాంత చారి విగ్రహం ముందు నిరసనలో టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్ కుమార్, తదితరులు

కేసీఆర్ కుట్రలను వ్యతిరేకించాలి: టీజేఎస్

వనస్థలిపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ రథసారథి ప్రొఫెసర్ కొదండరాం ఎమ్మెల్సీగా ఎన్నిక కాకుండా అడ్డుకుంటున్న కేసీఆర్ కుట్రలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి పల్లె వినయ్ కుమార్ చెప్పారు. కేసీఆర్ కుట్రలను నిరసిస్తూ తెలంగాణ జనసమితి రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని శ్రీకాంతచారి విగ్రహం ముందు నల్లరిబ్బన్లు ధరించి కేసీఆర్, కేటీఆర్‌లకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వినయ్‌కుమార్ మాట్లాడుతూ కోదండరాంపై కేసీఆర్ కుట్రలు కొత్తేమీ కాదన్నారు. గతంలో ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కొదండరాం పోటీ చేస్తే వందలాది కోట్ల రూపాయలను ఖర్చుపెట్టి ఓడించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నేడు ఎమ్మెల్సీ కాకుండా అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ చేస్తున్న కుట్రలను తెలంగాణ ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, ఉద్యమకారులు వ్యతిరేకించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జనసమితి జిల్లా ప్రధాన కార్యదర్శులు ధార సత్యం, కేవీ రంగారెడ్డి, నాయకులు కొత్త రవి, కార్తికొరెడ్డి, ప్రశాంత్, శేఖర్ యాదవ్, జంగయ్య, పుష్ప, శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.


లింగోజిగూడలో దేశవ్యాప్త సమ్మె వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ఎల్బీనగర్/వనస్థలిపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాల సంయుక్త వేదిక ఆధ్వర్యంలో, లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న నిర్వహించే సమ్మెను విజయవతం చేయాలని రంగారెడ్డి జిల్లా ఆటో ట్రాన్స్‌పోర్టు యూనియన్ అధ్యక్షుడు రాములు, సరూర్‌నగర్ సర్కిల్ సీఐటీయూ కన్వీనర్ మల్లెపాక వీరయ్య, సరూర్‌నగర్ సర్కిల్ సీపీఎం కార్యదర్శి వెంకన్న, సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్ పిలుపునిచ్చారు. సరూర్‌నగర్ లేబర్ అడ్డా భవన నిర్మాణ కార్మిక యూనియన్, కొత్తపేట ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ రవాణా రోడ్డు ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ సర్కిల్, లింగోజిగూడ ప్రాంతాలలో సమ్మె వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సరూర్‌నగర్ లేబర్ అడ్డా అధ్యక్షుడు నవీన్, వెంకన్న, శోభన్‌బాబు, రంగారావు, నాగరాజు పాల్గొన్నారు. లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో కార్మికులతో సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ లేబర్‌అడ్డా అధ్యక్షులు లక్ష్మణ్, నర్సింహ్మా, రాజు, చెన్నయ్య, బాలరాజు, యాదయ్య పాల్గొన్నారు.

ఇటు విద్యుత్ కార్మికులు.. అటు ఎమ్మెల్యే, కార్పొరేటర్లు ధర్నా


ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, కార్పొరేటర్ల ధర్నా

సైదాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్ కలెక్టర్ రజినీష్ బాబుపై దాడికి పాల్పడ్డ నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని బుధవారం ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ డీఈ కార్యాలయం ముందు యూనియన్ నేతలతో కలిసి కార్మికులు విధులు బహిష్కరించి ధర్నా చేశారు. మాదన్నపేట ఎస్‌ఆర్టీ కాలనీలో ఎంఐఎం కార్పొరేటర్ మమూపారా ఇంటి బకాయి విద్యుత్ బిల్లులు చెల్లించాలన్నందుకు బిల్ కలెక్టర్‌పై ఆమె కుటుంబ సభ్యులు దాడి చేయడంపై యూనియన్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జనవరిలో బేగంపేటలో, మాదన్నపేటలో విద్యుత్ కార్మికులపై వరుస దాడులు జరగడం దారుణమని అన్నారు. దాడులకు పాల్పడ్డ వ్యక్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకునే విధంగా చర్యలు చేపడుతానని డీఈ హన్మంతరెడ్డి వారికి హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు నిరసన విరమించి విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల యూనియన్ నేతలు ఈశ్వర్ రావు, సురేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ దాడిలో కార్పొరేటర్ సోదరుడు షపత్ అలీ, అక్రం అలీని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.


ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ కార్యాలయం ముందు కార్మికుల ధర్నా

పీఎస్ ముందు ఎమ్మెల్యే, కార్పొరేటర్ల బైఠాయింపు

మాదన్నపేట పోలీస్‌స్టేషన్ ముందు మంగళవారం అర్ధరాత్రి యాఖత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, పలువురు కార్పొరేటర్లు, ఎంఐఎం నేతలు బైఠాయించి ధర్నాకు దిగడంతో ఉద్రిక్తతకు దారితీసింది. బిల్ కలెక్టర్‌పై దాడి ఘటనలో కార్పొరేటర్ సోదరుడు షపత్‌అలీ, ఇతర కుటుంబసభ్యులపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సంతోష్‌నగర్, తలాబ్ చంచలం కార్పొరేటర్లు, పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి పీఎస్ ముందు బైఠాయించారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బిల్ కలెక్టర్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

పరిస్థితి ఉద్రిక్తతంగా మారడంతో సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ జానకీ ధరావత్ మాదన్నపేట పీఎస్‌కు చేరుకున్నారు. ఎమ్మెల్యేను లోపలికి పిలిపించి డీసీపీ మాట్లాడారు. కార్పొరేటర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బిల్ కలెక్టర్‌పై కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

రౌడీషీటర్లపై ఉక్కుపాదం: డీసీపీ


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సౌత్‌ఈస్ట్ డీసీపీ జానకి ధరావత్

సంతోష్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నేరప్రవృత్తిని వీడకుండా సామాన్యులను బెదిరిస్తే రౌడీషీటర్లను ఉక్కుపాదంతో అణచివేస్తామని సౌత్‌ఈస్ట్ డీసీపీ జానకి ధరావత్ హెచ్చరించారు. ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు బుధవారం సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ మహ్మద్‌గౌస్, ఇన్‌స్పెకర్ మల్లేష్‌తో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచామన్నారు. బస్తీలు, కాలనీలలో సామాన్య ప్రజలను బెదిరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నేరాలకు దూరంగా ఉండి సత్ప్రవర్తన కలిగిన వారికి షీట్లను తొలగించిన విషయాన్ని కూడా గుర్తు చేశారు. ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై ఉపేక్షించే ప్రసక్తేలేదన్నారు. కార్యక్రమంలో అదనపు ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్ఐలు అశోక్, మహేష్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీపురం కాలనీ అభివృద్ధికి కృషి : కార్పొరేటర్

వనస్థలిపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): శ్రీపురం కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శ్రీపురం కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ అధ్యక్షులు రేటినేని ముత్యంరావు ఆధ్వర్యంలో సభ్యులు కార్పొరేటర్ లచ్చిరెడ్డిని బుధవారం కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను కార్పొరేటర్ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీపురంకాలనీ కార్యదర్శి నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు రాంరెడ్డి, దామోదర్ రావు, పాండురంగం, అరవింద్‌రెడ్డి, వెంకటేశ్వర రావు, సూర్యవర్ధన్ రెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి కాలనీలో ఉచిత వైద్య శిబిరం

హయత్‌నగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నేత, పల్లవి ఫౌండేషన్ చైర్మన్ మల్క కొమురయ్య అన్నారు. పల్లవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కమల ఆసుపత్రి సౌజన్యంతో బుధవారం హయత్‌నగర్ పద్మావతి కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన


రైతు కుటుంబాలకు కోడి పిల్లలను పంపిణీ చేస్తున్న క్రీడా డైరెక్టర్ వినోద్‌కుమార్‌సింగ్

హయత్‌నగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రంలో స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుగుణమాల రైతు ఉత్పత్తిదారుల సంఘంలోని షెడ్యూల్ కులాలకు చెందిన కుటుంబాలకు పెరటి కోళ్ల పెంపకంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్రీడా డైరెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌సింగ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెనుకబడిన కులాలకు ఆర్థిక స్వావలంబన కార్యక్రమాలను ఆయన వివరించారు. పెరటి కోళ్ల పెంపకం వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలను తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన రైతు కుటుంబాలకు కోడి పిల్లలతోపాటు దాణా ఇతర సామగ్రిని అందించారు. కోడి పిల్లల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ సుధీర్ వివరించారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ రమణ, డాక్టర్ విజయ్‌కుమార్, రామకృష్ణ, శ్రీకృష్ణ, సుగణమాల రైతు ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్లు లింగం, మల్లారెడ్డి, అంజయ్య, నర్సింహ పాల్గొన్నారు.

బ్రేక్ ఫెయిలై ఆర్టీసీ బస్సు బీభత్సం

కారు, ఆటో, బైకులను ఢీకొనడంతో పలువురికి గాయాలు


బ్రేక్ ఫెయిలైన ఆర్టీసీ బస్సు

హయత్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): బ్రేక్ ఫెయిల్ కావడంతో ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. బస్సును నియంత్రించే ప్రయత్నంలో డ్రైవర్ ముందున్న కారు, ఆటో, బైకులను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి... దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన బస్సు బుధవారం ఉదయం చౌటుప్పల్ నుంచి దిల్‌సుఖ్‌నగర్‌కు వస్తుండగా హయత్‌నగర్ సమీపంలోని భాగ్యలత కాలనీ అయాన్ డిజిటల్ భవనం వద్ద బ్రేకులు ఫెయిలై ముందున్న కారు, ఆటో, మూడు బైక్‌లను ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న గోపీకృష్ణ, సత్యనారాయణ, బైక్‌పై ఉన్న వెంకటేష్, ప్రసాద్, మరికొందరు గాయపడ్డారు. వారిని సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ ధర్మయ్య చాకచక్యంతో వ్యవహరించి హ్యాండ్‌బ్రేక్‌తో బస్సును ఆపడంతో పెను ప్రమాదం తప్పింది. సంఘటనా స్థలాన్ని ఆర్టీసీ అధికారులు పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడంతో రాళ్లు ఎగిరి పడి బస్సు బ్రేక్ పైపులకు తగిలి ఉంటాయని, దాంతో బ్రేకులు పడి ఉండకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు. బాధితుల ఫిర్యాదుతో హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | రాజు : 99854 02786